క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

ఫార్మకాలజీలో విప్లవాత్మక మార్పులు



ప్రసంగిస్తున్న ప్రో వీసీ గీతాంజలి

కొమ్మాది: ఫార్మకాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో వైస్ చాన్సలర్ డా. డి.గీతాంజలి అన్నారు. అందుకు తగిన విధంగా సిద్ధం కావాలని సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న జిమ్సర్ వేదికగా ఆంధ్రప్రదేశ్ ఫార్మకాలజిస్ట్ సొసైటీ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫార్మకాలజిస్టుల జాతీయ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిమ్సర్ డీన్ డా.ఎస్.పి.రావు, డా.మాధవులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆనందరావు బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: పద్మనాభం మండల తహసీల్దార్‌గా కె.ఆనందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఎంఆర్‌డీఏ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ తహసీల్దార్‌గా చేసిన ఎం.ఆనంద్ కుమార్ పెందుర్తి బదిలీ అయ్యారు.

విద్యార్థులకు గణితంలో మెలకువల బోధన

తగరపువలస: నగరంలోని రైల్వే హైస్కూల్ గణిత ఉపాధ్యాయిని సాయి విమల చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణ పొందుతున్న ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు శుక్రవారం గణితంలో మెలకువలు బోధించారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆమె తన సహకారం అందించారు.

రెండు గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన

పద్మనాభం: హెచ్ఐవీపై మద్ది, తునివలస గ్రామాల్లో ప్రజలకు లింక్ వర్కర్ స్కీమ్ సీఏ లీడబ్ల్యూ ఎం.జ్యోతి శుక్రవారం అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష పాటించకూడదని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రమణమ్మ, ఆశ వర్కర్లు కుమారి, పార్వతి, అంగన్వాడీ కార్యకర్త కుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో దసరా సంబరాలు

పీఎం పాలెం: స్థానిక శిల్పారామంలో దసరా ఉత్సవాలు శనివారం సాయంత్రం నుంచి ప్రారంభం అవుతాయని స్థానిక పరిపాలన అధికారి టి. విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5, 6, 10, 11,12,13 తేదీలలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

వేద వినుత.. జ్ఞానప్రదాత



కుమ్మరిపాలెం రోడ్డులో యాతపేట వద్ద ..



తాళ్లవలస ఎస్సీ కాలనీ వద్ద గాయత్రీదేవిగా..

దుర్గామాత గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వేద వినుత.. జ్ఞానప్రదాత అయిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో, మండపాల్లో కుంకుమార్చనలు నిర్వహించారు. భవానీల శరణుఘోషతో అమ్మవారి ఆలయాలు, మండపాలు ప్రతిధ్వనించాయి. 8వ వార్డు ఎండాడలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, మధురవాడ టైలర్స్ కాలనీ విజయ దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, విశేషంగా అలంకరించారు. దుర్గాలమ్మ వారిని ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు దంపతులు, విశాఖ నార్త్ జోన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కాంతారావు తదితరులు దర్శించుకున్నారు.

కారుషెడ్ బబ్బేలమ్మ గుడిలో అమ్మవారిని బాలా త్రిపురసుందరిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. గాయత్రినగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో దుర్గాదేవికి పూజలు చేశారు.

– తగరపువలస/కొమ్మాది/ మధురవాడ /పీఎం పాలెం



జాతీయ రహదారిని ఆనుకుని వలందపేట వద్ద..



రెండోవార్డు వలందపేట రెడ్డివీధిలో..



ఒకటో వార్డు బాలాజీనగర్ మండపంలో అమ్మవారు



ఎండాడ ఆలయంలో బాలా త్రిపురసుందరి దేవిగా దుర్గమ్మ



గాయత్రి దేవి అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ



విజయదుర్గా దేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



బబ్బేలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

రైతుబజారులో విక్రయాలకు సన్నాహాలు

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.78 లక్షలతో నిర్మాణం
- వినియోగదారుల హర్షం

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో ప్రధాన కేంద్రమైన తగరపువలసలో వినియోగదారుల నాలుగు దశాబ్దాల నాటి రైతుబజారు కల నెరవేరుతున్న క్షణాలు ఇవి.. మార్కెటింగ్ శాఖ ఈ నెల 5 లేదా 7వ తేదీ నుంచి విక్రయాలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది.

టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు తగరపువలసలో రైతు బజారు నిర్మించి వినియోగదారులకు కూరగాయలు, ఆకుకూరల ధరలు అందుబాటులోకి తీసుకు వస్తామని ఊరిస్తూ వచ్చారు. చివరకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ హయాంలోనే భీమిలి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సారథ్యంలో రూ.78 లక్షలతో చిట్టివలసలో రైతు బజారు నిర్మించారు. రైతు బజారు నిర్మాణంలో ఉండగా అక్కడే ఉన్న రక్షణగోడ కూలిపోవడంతో ముందుగా రూ.74 లక్షలతో రక్షణగోడ నిర్మించి, మిగిలిన స్థలంలో రైతు బజారు నిర్మాణం పూర్తి చేశారు.



చిట్టివలస రైతుబజారులో ప్రదర్శించిన కూరగాయల ధరల పట్టిక



శిలాఫలకం ఏర్పాటు చేస్తున్న మార్కెటింగ్ శాఖ సిబ్బంది

ఎన్నికల కోడ్ రావడంతో..

గత సాధారణ ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 31 దుకాణాలు, స్టోర్ రూములు, టాయిలెట్లను ప్రారంభించారు. వెంటనే ఎన్నికల కోడ్ రావడంతో విక్రయాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మెయిన్‌రోడ్డును ఆనుకుని ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయదారులు రహదారిపై విక్రయాలు జరుపుతుండటంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రయాణికులతో పాటు ట్రాఫిక్ పోలీసులకు తలనొప్పిగా తయారైంది. దీంతో ఈ ప్రాంత ప్రజల ఒత్తిడి మేరకు చిట్టివలస రైతుబజారులో విక్రయాలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన ప్యాచ్ వర్కులతో పాటు ధరల పట్టిక, శిలాఫలకం అమర్చే పనుల్లో మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు తలమునకలై ఉన్నారు. రైతుబజారులో విక్రయాలు ప్రారంభం కానుండటంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ చలవే..



చిట్టివలసలో రైతుబజారు ఏర్పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చలవే. 40 ఏళ్ల పాటు టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు సాధించలేని రైతుబజారును వైఎస్సార్‌సీపీ నెరవేర్చింది. ప్రజల అవస్థలు అర్థం చేసుకుని దీనిని ఏర్పాటు చేసింది.

– జీరు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

పద్మనాభంలో డీసీసీబీ బ్రాంచ్ ప్రారంభం



పద్మనాభంలో డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచ్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్‌తో కలిసి, ఆయన ఈ బ్రాంచ్‌ను ప్రారంభించారు. అనంతరం రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్య్ర సమర యోధుడు కశిరెడ్డి పాపయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తదుపరి అనంతుని కొండ రోడ్డు పనులు పరిశీలించారు. అనంతుని దీపోత్సవం లోగా కొండ రోడ్డు, అనంతుని ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అనంతుని ఆలయ చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందించిన పంచాయతీ రాజ్ రిటైర్డ్ డీఈఈ ఆర్.కృష్ణ కుమార్ అందజేశారు. శిథిలావస్థలో ఉన్న ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగించి దీని స్థానంలో కొత్తది నిర్మించాలని ఎస్ఎంసీ చైర్మన్ హెచ్. జ్యోతి ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, డీసీవో ప్రవీణ, సీఈవో డీవీఎస్ వర్మ, మేనేజర్ బి.వెంకట అప్పారావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదర రావు, టీడీపీ అధ్యక్షుడు కె.రమణ పాల్గొన్నారు.

అధికారుల వినూత్న ప్రచారం

ఫుట్‌పాత్, డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలని అవగాహన ర్యాలీ

తగరపువలస: అధికారులు వినూత్న ప్రచారం నిర్వహించారు. జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలు, అనధికార పార్కింగ్‌లను వ్యాపారులు ఖాళీ చేయాలని కోరుతూ తగరపువలసలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భీమిలి జెడ్సీ పి.ప్రేమ ప్రసన్న వాణి, ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు, అసిస్టెంట్ సిటీప్లానర్ దవళ శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు వదలాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంబేడ్కర్ కూడలి నుంచి చిట్టివలస ఈఎస్ఐ ఆసుపత్రి, భీమిలి రోడ్డు, రాములమ్మ థియేటర్ రహదారుల్లో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పలువురికి హెచ్చరికలు జారీ చేశారు. ప్రధాన రహదారిపై అనధికార పార్కింగ్ ప్రదేశాలలో ఉంచిన వాహనాల యజమానులపై కేసులు రాశారు.



మెయిన్‌రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది

కోలాటం పోటీలు

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో దసరా సందర్భంగా గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోలాటం పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ముందుగా మండల స్థాయి పోటీలు ఉంటాయని, ఫైనల్ పోటీలను 12వ తేదీన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహిస్తామని తెలియజేశారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 50,116, ద్వితీయ బహుమతిగా రూ.25,116, తృతీయ బహుమతిగా రూ.15,116 ఎమ్మెల్యే గంటా చేతులమీదుగా అందిస్తామన్నారు. వివరాలకు 80084 45588 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

120 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి వద్ద భీమిలి వైఎంసీఏ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. 120 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

చర్చిని పరిరక్షించాలని వినతి

చారిత్రక ప్రాధాన్యం ఉన్న చర్చిని ఆనుకుని ఉన్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో చర్చికి ఇబ్బంది లేకుండా చూడాలని వైఎంసీఏ, చర్చి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గంటాను కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, చర్చికి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైఎంసీఏ సౌత్ ఈస్ట్ ఇండియా రీజియన్ చైర్మన్ డాక్టర్ రోలండ్ విలియమ్స్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ స్టీఫెన్ పీటర్, భీమిలి వైఎంసీఏ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్, కార్యదర్శి ఆల్బర్ట్ సుదర్శన్, కోశాధికారి ప్రేమానందం, ఎస్.విలియంకేరీ, పాస్టర్లు ప్రభాకర్, గిడియన్ విజయకుమార్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ శిక్షణ

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా బ్యూటీ అండ్ వెల్‌నెస్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో యుగశక్తి సహకారంతో ఈ శిక్షణ ఇస్తున్నట్టు నిర్వాహకురాలు అమ్మాజీ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పట్నాయక్ పాల్గొన్నారు.

జమ్మి చెరువు పార్కులో పిచ్చిమొక్కలు

పాములు వస్తుండడంతో హడలిపోతున్న సందర్శకులు

భీమునిపట్నం: భీమిలిలోని జమ్మి చెరువు పార్కులో చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి బాగా పెరగడంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ తగరపువలస వెళ్లే మార్గంలో ఉన్న ఈ పార్కులో విశాలమైన చెరువు ఉంది. గతంలో ఇది కళావిహీనంగా ఉండడంతో పెద్దగా సందర్శకులు వచ్చేవారు కాదు. అయితే, గత ప్రభుత్వం ఈ పార్కు ఆధునికీకరణకు రూ. 84 లక్షలు కేటాయించింది. అందులో భాగంగా తొలి విడతగా గత సంవత్సరం రూ. 42 లక్షలతో పార్కును అందంగా తీర్చిదిద్దారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, జిమ్ పరికరాలు, లైటింగ్ సదుపాయంతో పాటు చెరువు చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. దీంతో సందర్శకులు బాగా వస్తున్నారు. ఉదయం, సాయంత్రం చాలా మంది వాకింగ్ చేస్తున్నారు. అయితే చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి బాగా పెరిగిపోయింది, దీనివల్ల ఇక్కడ పాములు పెద్ద సంఖ్యలో ఉండడం సమస్యగా మారింది. ఇన్ని పనులు చేపట్టిన అధికారులు దీన్ని తొలగించకపోవడం వల్ల తరచూ పాములు పార్కులోకి, వాకింగ్ ట్రాక్‌లోకి వచ్చేస్తున్నాయి, దీంతో పార్కుకు వచ్చే వారితో పాటు వాకింగ్ చేసేవారు భయపడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు కూడా ఎక్కువ మంది వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెరువు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.



చెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్



జమ్మి చెరువు చుట్టూ పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

కొద్దిమందికే రేషన్ కందిపప్పు

- డిపోలకు అరకొర సరఫరా
- కార్డుదారులకు సర్దిచెప్పలేక పోతున్న ఎండీయూ ఆపరేటర్లు

తగరపువలస: కూటమి ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా అరకొరగా పంపిణీ చేస్తున్న కందిపప్పు ఎండీయూ ఆపరేటర్లు, కార్డుదారుల మధ్య తగాదాలకు కారణమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా ఈ నెల 3న డీలర్లకు వారి వద్ద ఉన్న కార్డుల సంఖ్యలో 30 నుంచి 40 శాతం మాత్రమే పౌర సరఫరాల శాఖ కందిపప్పు జారీ చేసింది. అసలే చాలా నెలలుగా కందిపప్పు సరఫరా కాకపోవడం, పండగ నెలలో అరకొరగా పంపిణీ చేయడంతో ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు సర్ది చెప్పలేకపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర రూ.160 నుంచి రూ.180కు ఉంది. రేషన్‌లో రూ.67కే లభిస్తుందన్న ఆశతో వస్తున్న కార్డుదారులకు నిరాశే ఎదురవుతోంది. రొటేషన్ పద్ధతిలో దసరాకు కొందరికి, దీపావళికి మరికొందరికి పప్పు ఇస్తామని చెప్పి ఒప్పించడానికి నానా పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయాలని పలు చోట్ల వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సంతపేట రేషన్ వాహనం వద్ద కందిపప్పు పంపిణీ

అవయవదాతల సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా వెంపాడ



శ్రీనివాసరెడ్డికి నియామక పత్రం ఇస్తున్న సీతామహాలక్ష్మి

తగరపువలస: అఖిల భారత అవయవదాతల సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా వెంపాడ శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. సమాజసేవలో చురుగ్గా ఉంటున్న శ్రీనివాసరెడ్డికి భీమిలి సన్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి ఈ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సన్ స్కూల్ చైర్మన్ కైతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమిలి పీఎస్‌లో నగరానికి చెందిన మహిళ విచారణ

తగరపువలస: నగరానికి చెందిన ఒక మహిళను అక్కడి పోలీసులు నేర పరిశోధనలో భాగంగా శుక్రవారం భీమిలి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వివరాలు గోప్యంగా ఉంచడంతో ఆ మహిళ ఏ నేరం చేసింది? ఎవరనే విషయాలు తెలియరాలేదు. స్థానికంగా ఉన్న నేరస్తులను అక్కడి పోలీస్ స్టేషన్లలో విచారించేటప్పుడు గొడవలు జరిగే ఆస్కారం ఉన్నందున మరొక పోలీస్ స్టేషన్‌లో విచారిస్తుంటారని, అందులో భాగంగానే ఆమెకు ఇక్కడకు తీసుకువచ్చినట్టు తెలిసింది.